విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయండి:కమిషనర్

విశాలాంధ్ర - చిత్తూరు : జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని నగర కమిషనర్ డా. జె అరుణ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ పురోగతిపై హౌసింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో బుధవారం వీడియో సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయించాలన్నారు. ప్రధానంగా ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. పునాదులు పూర్తి చేసిన వారు సత్వరం మిగిలిన పనులు ప్రారంబించేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇతర వస్తువులతో పాటు మేస్త్రీలు, కూలీలను సమకూర్చి ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలన్నారు. మేస్త్రీలు, కూలీలు రోజూ పనులకు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలన్నారు. రోజువారి, వారాంతపు లక్ష్యాలను కచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా, చిత్తశుద్ధితో పనిచేయాలని వార్డు కార్యదర్శులు, హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, వార్డు అమినిటీ కార్యదర్శులు, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

కాణిపాక ఆలయ అభివృద్ధికి విరాళాలు

విశాలాంధ్ర - ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు వినాయక స్వామి వారి మూలమూర్తి కి వెండి తొడుగు బొజ్జ విరాళం, సుమారు బరువు 5 కిలోల 800 గ్రాములు విలువ 4,30,000 రూపాయలు మరియు నిత్య అన్నదానానికి విరాళం రెండు లక్షల ఇరవై 8 వేలు, గో సంరక్షణ ట్రస్ట్ కి 1,00,116 రూపాయలు, దాత ఎల్జి మిల్క్ ప్రొడక్ట్స్ గీత మరియు వరలక్ష్మి చిత్తూరు వాస్తవ్యులు డిడి రూపంలో ఆలయ ఈవో వెంకటేష్ దగ్గర అందజేశారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, వేద పండితులచే ఆశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మాధవరెడ్డి, పర్యవేక్షకులు కోదండ పాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షం విశాలాంధ్ర దినపత్రిక

కేలండర్‌ను ఆవిష్కరించిన కల్లూరు ఎస్సై

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు: విశాలాంధ్ర దినపత్రిక ప్రజల పక్షమని కల్లూరు ఎస్సై రవి ప్రకాష్ రెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరులో బుధవారం విశాలాంధ్ర నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రిక దశాబ్దాలుగా ప్రజల పక్షం నిలుస్తూ వారికి అండగా ఉంటున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్‌కు అభినందనలు వెల్లువ

విశాలాంధ్ర-పుంగనూరు: దేశంలోని వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులైన గవర్నర్లు ఎంపీలు పారిశ్రామికవేత్తలు పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఐఏఎస్ ఐపీఎస్ తదితర ఉన్న అధికారులు ను భారత్ గౌరవ్ అవార్డ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు ప్రత్యేక అవార్డులకు ఎంపిక చేసి అవార్డులను ప్రధానం చేయడం జరుగుతుంది అందులో భాగంగా 2022 ప్రతిష్టాత్మకమైన భారత్ యూత్ అవార్డును పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన పారిశ్రామికవేత్త ఆపదలో ఉన్న వారికి అప్పన్న హస్తం అందిస్తూ ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా మన్నులను పొందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రాష్ట్ర ప్రజలకు సుపరిచితుడు బోడె రామచంద్ర యాదవ్ గురువారం అవార్డు అందుకుంటున్న వేళ ఆయన అభిమానులు బడుగు బలహీన వర్గాలుకు చెందిన వారు ఆర్‌సివైటీం సభ్యులు ఆయనకు ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌సివైటీం సభ్యులు మాట్లాడుతూ అభిమాన నాయకుడు రానున్న రోజుల్లో ఆ దేవదేవుని ఆశీస్సులు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మరెన్నో అవార్డులు అందుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

కోవిడ్ పేషెంట్లకు ఆక్సిజన్ బెడ్లు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-పలమనేరు : స్థానిక ఏరియా ఆసుపత్రి లో కోవిడ్ ముందస్తు మాక్ డ్రిల్ లో భాగంలో బుధవారం జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ వచ్చిన ప్రజలు బయపడవలసిన అవసరము లేదని ప్రతి ఒక్కరు మస్కుతప్పనిసరిగా ధరించా లన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ భౌతిక దూరము పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - తిరుపతి: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సబార్డినెట్ న్యాయస్థానాల క్యాలెండర్ మరియు డైరీలను బుధవారం తిరుపతి కోర్టు సముదాయంలో తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్ష్యులు టి.దినకర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.షణ్ముగం యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత దేశ రాష్ట్ర రాజకీయ సామాజిక పరిస్థితుల్లో చట్టసభల్లో న్యాయవాదుల పాత్ర అవసరం ఉందని, పోరాటాల ద్వారానే హక్కుల సాధన సమస్యల పరిష్కారం అవుతుందని అన్నారు. అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది ఏనుగు భాస్కరుడు మాట్లాడుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రూపొందించిన క్యాలెండర్ మరియు డైరీలు న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కోర్టు సెలవులు, కోర్టు కేసులను చూసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజమణిక్యం, ఉపాధ్యక్షులు యోగానంద్, బార్ అసోసియేషన్ కార్యదర్శి హారనాథ్, మురళీమోహన్ మరియు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సభ్యులు మరియు న్యాయవాదులు న్యాయవాదులు సురేష్ బాబు, గోపిచంద్, శ్రీధర్ రెడ్డి, చెంచుకుమార్, శ్రావణ్ కుమార్, సుమన్, కల్యాణి, నీలిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో అద్దాలమేడ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు అద్దాలమేడ నిర్మాణానికి భూమి పూజ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే బాబు విచ్చేశారు. మండపం అంచనా సుమారు ఒక కోటి రూపాయలు, దాత ఏ.ఎం.ఆర్. ఇండియా లిమిటెడ్ హైదరాబాదు వాస్తవ్యులు ఏ .మహేష్ రెడ్డి ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు,ఈ ఈ వెంకటనారాయణ, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి మరియు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

స్మశాన స్థలం కోసం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామస్థులు

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి: కడపనత్తం పంచాయతీ గౌనీతిమ్మేపల్లి గ్రామంలోని ఎస్ సి కాలనీ వాసులు సుమారు 60 కుటుంబాలున్నాయి.పూర్వీకులు నుండి గ్రామంలో ఎవరు మరణించిన ఖననం చేయాలంటే 1.5 సెంట్లు స్థలంలోనే ఖననం చేయాలి. చనిపోయిన వారిని పూడ్చిన చోటె మళ్ళీ పుడ్చాల్సిన పరిస్థితి దాపరిస్తున్నది.శవాన్ని తీసుకెళ్లాలంటే కూడ దారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవ్వడం జరుగుతున్నది.స్మశాన స్థలం కూడ లేదు .దయవుంచి నెలకొన్న దారి సమస్య,స్థలం కేటాయించి ఇవ్వాలని గౌనీతిమ్మేపల్లి గ్రామస్థులు తహశీల్దార్ కార్యాలయం బాట పట్టి గ్రామస్థుల చేతుల మీదగా ఎం ఆర్ ఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, గౌనీతిమ్మేపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు:ఎంఎస్ బాబు

విశాలాంధ్ర - ఐరాల : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ లకు మతి భ్రమించిందని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని కొనియాడారు. అలాగే పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. బుధవారం పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి మండలం మత్యం గ్రామ పంచాయతీ పరిధిలోని జోగి వారి ఇండ్లు , పైపల్లె ఎగువ మత్యం దళితవాడ, ఎగువమత్యం గ్రామంలో ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక చంద్రబాబు నాయుడు సహనం కోల్పోయి సైకిల్ పోవాలని చెప్పడం చూస్తుంటే చంద్రబాబు పరిస్థితి ఏంటో అర్థం అయిపోయిందని విమర్శించారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు, మోడీ జపం చేస్తు ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు. ఈ రోజు ప్రతి ఇంటి వద్దకు శాసనసభ్యుడుగా వెళ్లగలుగుతున్నామంటే మా ముఖ్యమంత్రి తీసుకువచ్చిన సంక్షేమ పథకాలేనని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద కు వెల్తుంటే అక్కా చెల్లెమ్మలు ,అవ్వ తాతలు ప్రతి ఒక్కరు చిరునవ్వుతో తమకు ఘన స్వాగతం పలుకుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబు, నాయుడు పవన్ కళ్యాణ్ ఎన్ని కుట్రలు చేసినా జగన్మోహన్ రెడ్డి ప్రభంజనాన్ని ఆడుకోలేరని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ నాయకులు శరత్ రెడ్డి, సతీష్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి:డిఆర్వో

విశాలాంధ్ర - రామకుప్పం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న విద్య మరియు వైద్య వసతుల కల్పనకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ రాజశేఖర్ సూచించారు బుధవారం మండల పరిధిలోని ఎస్టీ హాస్టల్ ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఉచిత విద్య తో పాటు వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని పేర్కొన్నారు హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు అధికారులతో రివ్యూ నిర్వహించి హాస్టల్లో పనితీరు ఏ విధంగా ఉందని ప్రత్యేకంగా విద్యార్థులను అడిగి తెలుసుకుని ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మంచినీటిని సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించినట్లైతే వారి ఎదుగుదలతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవడం జరుగుతుందని తద్వారా కష్ట పడి కాకుండా ఇష్టపడి చదవడం అలవాటు చేసుకుంటారని ఇప్పటికే పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల అయిందని పదవ తరగతి విద్యార్థులు విషయంలో మరింత మెరుగైన చర్యలు తీసుకుని వారు మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కోరారు అనంతరం క్లాసు రూములు, వంట రూములు, బస చేసే రూములు ఆహార పదార్థాలు, ధాన్యం నిల్వలు తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు బాబురెడ్డి కో కన్వీనర్ చంద్రారెడ్డి ఎంపీపీ సుబ్రహ్మణ్యం సర్పంచుల సంఘం అధ్యక్షులు మురళి వైస్ సర్పంచ్ ఏజాజ్ మరియు వార్డెన్ తదితరులు పాల్గొన్నారు

నిద్ర లేపి పింఛన్లు అందిస్తున్నాం: వెంకటే గౌడ

గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - వి. కోట : పొద్దు పొడవక ముందే నిద్ర లేపి పెన్షన్లు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారధ్యం లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని పలమనేరు ఎమ్మెల్యే ఎన్. వెంకటేగౌడ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద భరిణేపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సర్పంచ్ శ్రీనివాసులు తో కలసి గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ పరిధిలోని కమ్మేపల్లి, పెద్ద భరిణేపల్లి, ఆదినేపల్లి గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెల్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నవరత్నాల పేరిట రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగ పంచాయతీ లోని లబ్ధిదారులకు వాటిఫలాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుంటూ సమస్యలు ఉంటే అక్కడిక్కడే అధికారులతో చర్చించి పరిష్కారం చేస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ జి. శ్రీనివాసులు, ఎంపిపి యువరాజ్, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్‌లు గోపిరెడ్డి, దవనం భక్తవత్సలం,పంచాయతీ కన్వీనర్ గోపాల్ రెడ్డి, స్థానిక ఎంపీటిసి రామచంద్ర, ఇతర ఎంపీటీసీ లు మురుగేష్, ఆనంద్ శివరంజని, సర్పంచులు దామోదర్, సుభాష్, ఎంపీడీవో బాలాజీ, ఏపీవో అశోక్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలో విద్యార్థులకు మెరుగైన విద్య

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు: డిజిటల్ విధానంలో విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తున్నదని రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్ ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు.పులిచెర్ల మండలం కల్లూరు, ఎల్లంకి వారి పల్లె, కావేటి గారి పల్లె, మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రెడ్డి 8వ విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్ మాట్లాడుతూ గ్లోబల్ సిటిజన్ గా తీర్చిదిద్ది డిజిటల్ విధానంలో పాఠ్యాంశాలు మరింత సులభంగా అర్థవంతంగా మెరుగైన చదువుల దిశగా ప్రతి విద్యార్థిని తయారు చేయాలని, అలాగే పోటీ ప్రపంచంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యార్థులు నైపుణ్యం సాధించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బృహత్తర ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజీ ప్రసాద్, సర్పంచులు ఎస్. ఏ షుకూర్, నటరాజ,మధు, సుజాత,ఏఎంసి ఉపాధ్యక్షులు నాగరాజ ప్రసాద్ ,ఎంపీటీసీలు రెడ్డి అహ్మద్, మంజుల మునస్వామి, గీతాంజలి, ఎంఈఓ సిద్దరామయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రఫీ, మస్తాన్, హెచ్‌ఎంలు పోకల తాతయ్య, గిరి ప్రకాష్ ,సుమలత ,మంజువాణి ,ఉపాధ్యాయులు పనపర్తి వెంకట సిద్దులు ,రాజేంద్ర ,వేణుగోపాల్, ప్రకాష్ ,చలపతి, సిఆర్పిలు పాల్గొన్నారు.

పిల్లల బంగారు భవిష్యత్తుకు పెద్ద పీట



విశాలాంధ్ర - కార్వేటినగరం: పిల్లల బంగారు భవిష్యత్తు ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తున్నట్లు ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని 12 పాఠశాలల్లో 8వ తగరతి విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద పిల్లలకు ఉన్నత విద్య అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వెస్ జగన్మోహన్రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చి ఆదుకుంటున్నా కొందరు వాటిని కూడా విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి ఇంజినీరు, డాక్టర్ కావాలనే తాపత్రయంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహం విద్యార్థులు సద్వినియోగం చేసుకోని ముందుసాగాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ విజయకుమార్,ఎంపీడీఓ మోహన్ మురళి, సర్పంచ్ లు, ఎంపీటీసీ,విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరోనా పట్ల అప్రమత్తంగా ఉండండి

-జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు

విశాలాంధ్ర - కార్వేటినగరం: కరోనా మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. బుధవారం ఆయన ప్రాథమి ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ కరోనా వైరస్ పట్ల సోషియల్ మీడియాలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అయితే అలాంటి వాటికి భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. వ్యాక్సిన్ వేసుకోని వారు,తప్పకుండా వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ మాస్క్ లు వాడాలని, శానిటైజర్ లు,చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం కార్వేటినగరం,నగరి పీహెచ్సీలను సందర్శించి రికార్డులను పరిశీలించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు సురక్షితం

విశాలాంధ్ర -బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్ చందర్, డాక్టర్ శాలిని ఆధ్వర్యంలో టి ఎన్ కుప్పం కడప నత్తం గ్రామంలో వైయస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమము నిర్వహించి గర్భవతులు బాలింతలు చిన్నపిల్లలు స్కూల్ పిల్లలకి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాలిని మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ప్రతినెలా డాక్టర్ చెకప్‌లు ముఖ్యమని ప్రమాద లక్షణములన్న గర్భవతులకు ప్రత్యేక ఆరోగ్య సూచనలిచ్చారు. సావిత్రి హెల్త్ ఎడ్యుకేటర్ పిల్లలకి అవగాహన కల్పిస్తూ చేతులు వ్యక్తిగత శుభ్రత పోషకాహారము ముఖ్యమని తెలిపారు సీజనల్ వ్యాధుల నియంత్రణ నివారణ గురించి పరిసరముల పరిశుభ్రత రక్షిత మంచినీరు గురించి తెలిపారు ఈ కార్యక్రమంలో టీచర్లు వైద్య సిబ్బంది పుష్పలత ఎర్రం రెడ్డి మౌనిక బేబీ సుశీల పాల్గొన్నారు.

వంద రోజులు తప్పనిసరిగా పని కల్పించాలి

విశాలాంధ్ర - పాలసముద్రం : ప్రతి ఒక్క కుటుంబానికి ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీవో విద్యావతి అన్నారు బుధవారం నాడు ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఉపాధి హామీ సంచాలకులు సుబ్రమణ్యం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన ప్రతి కూలీకి డబ్బులు పూర్తిగా వారి ఖాతాలో జమ చేశామని ఎప్పుడు చేసిన పనులకు అప్పటికప్పుడే నగదు చెల్లింపులు చేస్తున్నామని అన్నారు అదేవిధంగా ప్రతి గ్రామంలో గ్రామ వర్కులు కమ్యూనిటీ వర్కులు రైతులకు సంబంధించిన వర్క్ లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఏపీవో బాల ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- పలమనేరు : ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ముద్రించిన 2022 వ సంవత్సరంలో విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వుల సంపుటి మరియు 2023 సంవత్సరపు దైనందినిలను స్థానిక కళామందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు పి తులసీనాథం నాయుడు మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఉత్తర్వుల సంపుటి ని ఉపాధ్యాయ మార్గ దర్శిని పేరిట తీసుకు వస్తున్న ఏకైక సంఘం ఏపీటీఎఫ్ మాత్రమే అన్నారు. ఉపాధ్యాయులకు కావలసిన సమగ్ర సమాచారంతో దైనందినిని ముద్రించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు గురుమూర్తి, సుదర్శన్ ఆచారి, బాలసుబ్రమణ్యం గురునాథం చిరంజీవి,పుష్ప,హరిబాబు, అభిదాలి,ముద్దు కృష్ణ, ఏసురత్నం, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తీర్థంలో జీతం- చిత్తూరులో ఉద్యోగం

విశాలాంధ్ర -బైరెడ్డిపల్లి : మండలపరిధిలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ల్యాబ్ టెక్నీషియన్ గా హరిప్రసాద్ 2008, అక్టోబర్ నెలలో ఉద్యోగం లో చేరాడు. దాదాపు 2 సంవత్సరాలు ఉద్యోగం చేసాడు. ఆ తరువాత తీర్థం మారుమూల గ్రామం అవడం వలన అక్కడకు రావడం, వెళ్లడం ఇబ్బంది అవడం వలన, రాజకీయనాయకులు, పై అధికారుల అండదండలతో చిత్తూరు కు డెప్యూటేషన్ పై వెళ్ళాడు. కానీ జీతం మాత్రం తీర్థం లెక్కలోనే తీసుకుంటున్నాడు. తీర్థం ఆరోగ్య కేంద్రం నందు ప్రతినెలా 9 తేదీన గర్భవతులు,హెచ్.బి పరీక్ష, అనేక రక్త చేసుకోవడానికి అనేకమంది రోగులు వస్తుంటారు. ఇక్కడ ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడం రక్తపరీక్షలు చేయించుకోవడానికి దాదాపు 9 కిలో మీటర్స్ బైరెడ్డిపల్లి కి వెళ్లాల్సి ఉంది. అక్కడ ప్రైవేట్ ల్యాబ్ వాళ్ళు ఇష్టరాజ్యంగా రోగుల దగ్గర డబ్బులు గుంజుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇకనైనా డి యం హెచ్ ఒ స్పందించి డెప్యూటేషన్‌పై వెళ్లిన వారినైనా ఇక్కడకు పంపాలి, లేదా కొత్త వారినైనా ఇక్కడ పంపాలని ఇక్కడి తీర్థం వాసులు కోరుకుంటున్నారు.

ముఖ్యమంత్రి ఆశయ సాధనకు కృషి చేయండి

విశాలాంధ్ర - పెద్దపంజాణి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలని కోగిలేరు సర్పంచ్ రమేష్ బాబు అన్నారు. బుధవారం కోగిలేరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబులను సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని రీతిలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా నాడు నేడు పథకాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో సీబీఎస్ సిలబస్ అందించాలని అందుకోసం ముందస్తుగా 8వ తరగతి విద్యార్థులను పదో తరగతి వచ్చేలోపు ఆంగ్లంలో పట్టు సాధించేలా విద్యా బోధనలో సిద్ధం చేయడానికి ఉచితంగా ట్యాబులను పంపిణీ చేస్తున్నారన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు ఉపాధ్యాయులు బసంతి లలితమ్మ శారదమ్మ నాయకులు శివశంకర్ రెడ్డి, గౌతమ్ రెడ్డి, రెడ్డప్ప, మొగిలీశ్వర, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

బెడ్ సీట్లు పంపిణీ చేసిన కౌన్సిలర్

విశాలాంధ్ర - పుంగనూరు : పట్టణ ప్రాంతంలో యాచకులు ఎక్కడబడితే అక్కడ నిద్రించడం వలన చలి తీవ్రత అధికంగా ఉండడంతో యాచకులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న కౌన్సిలర్ షావలి అర్షద్ అలీ బెడ్ సీట్లను వారికి పంపిణీ చేయడానికి సిద్ధం చేయడం జరిగింది వీటిని ఆయన అభిమానులు ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు టెంకాయల రాజా పెంచుపల్లి కృష్ణప్ప బుధవారం రోజున యాచకులకు పంపిణీ చేయడం జరిగింది.

ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి సన్మానం

విశాలాంధ్ర -పలమనేరు : పట్టణ సమీపంలోని చరణ్ హోటల్ నందు బుధవారం గోవింద దివ్య ధామం చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులైనవిశాలాంధ్ర శ్యామ్, ఆంధ్రప్రభ,ఆదిశేషయ్య సాక్షి,సుబ్రహ్మణ్యం అలియాస్ మణి,ప్రజాశక్తి, సుబ్రహ్మణ్యం లతోపాటు ఎలక్ట్రానిక్ మీడియా యూట్యూబ్ సోమశేఖర్, లోకనాథం, మోహన్, అమర, చంద్ర, మునిరత్నం, దేవేంద్ర భాను,కుమార్,నాయుడు, వినాయక, రామాంజులు,సుబ్బు, శివ, మహబూబ్, హేమంత్,భార్గవ్, వీరితో పాటు మరికొంతమందిని శ్రీ గోవింద దివ్య దామం వారు శాలవా కప్పితిరుమల లడ్డు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోవింద దివ్య దామం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సిద్దయ్య, వాణి కళాశాల కరస్పాండెంట్ కృష్ణమూర్తి రెడ్డి, శ్రీవారి సేవకుడు రవీంద్రారెడ్డి,లాయర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

మధర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్

విశాలాంధ్ర - గంగవరం: మండలంలోని మధర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ స్థాయి వర్క్ షాపు నిర్వహించారు. ఈసీఈ గ్రూపుకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన ప్రయోగం పీసీబీ పై నిర్వహించారు. చిత్తూరు ఎస్ వీ సెట్ లో హ ఓ డీ నాగరాజు చేత తరగతులు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం రవీంద్రబాబు, సునీల్, రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి

విశాలాంధ్ర– తిరుమల: భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి వై చంద్ర చూడ్ బుధవారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ జస్టిస్ చంద్ర చూడ్ కు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో సాంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం జస్టిస్ చంద్ర చూడ్ దంపతులు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారి శేషవస్త్రంతో సన్మానించి వేద ఆశీర్వాదం చేశారు . అనంతరం ఆశీర్వాద మండపంలో సిజె ఐ కి చైర్మన్, ఈవో అమ్మవారి ప్రసాదాలు అందజేసి వస్త్రంతో సన్మానించారు .జిల్లా జడ్జి వీర్రాజు , టీటీడీ సివిఎస్వో నరసింహ కిషోర్, డిప్యూటీ ఈవో శాంతి , విజివో మనోహర్, అదనపు ఎస్పీ కులశేఖర్, డిఎస్పీమురళీకృష్ణ,ఆలయఏఈవోప్రభాకర్‌రెడ్డిఆగమసలహాదారుశ్రీనివాసాచార్యులు,అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామిని సేవలో: భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి వై చంద్ర చూడ్ బుధవారం రాత్రి కుటుంబ సమేతంగా కల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయం ఎదుట టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ జస్టిస్ చంద్ర చూడ్ కు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం జస్టిస్ చంద్ర చూడ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు శేషవస్త్రంతో సన్మానించి వేద ఆశీర్వాదం చేశారు . అనంతరం సిజె ఐ కి చైర్మన్,ఈవో స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం చంద్రచూడ్ దంపతులు ఆలయంలో గోపూజలో పాల్గొ న్నారు. గోవు,దూడకు పూజలుచేసిగ్రాసం తినిపించారు.జిల్లా జడ్జి వీర్రాజు , టీటీడీ సివిఎస్వో నరసింహ కిషోర్, ఆర్డీవో కనక నర సారెడ్డి ,డిప్యూటీ ఈవో వరలక్ష్మి , విజివో మనోహర్, అదన పు ఎస్పీ కులశేఖర్,డిఎస్పీనరసప్ప ,ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి, బాలాజి రంగాచార్యులు ఆలయ సూపరింటెండెంట్ముని చంగలరాయులు పాల్గొన్నారు.

అమ్మఒడితో ఆర్థిక భరోసా

- మంత్రి ఆర్.కె.రోజా

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ పరిధిలోని రాష్ట ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమ్మఒడి పథకంతో ఆర్థిక భరోసా కల్పించారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల మరియు క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. పుత్తూరు లోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబులను బుధవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో మంత్రి మాట్లాడుతూతెలంగాణ, తమిళనాడు కర్ణాటక ఏ రాష్ట్రానికి వెళ్లినా మీకు లాంటి ముఖ్యమంత్రి మాకు లేరే అనిబాధపడుతున్నారని అన్నారు మన రాష్ట్రంలో పిల్లల చదువు కోసం ఖర్చు పెడుతున్న తీరు చూస్తే మీపై ఎంత అభిమానం ఉందొ అర్థమవుతుందని అన్నారు. సరైన ఆహారం లేకుండా వున్నారని పిల్లల కోసం జగనన్న స్వయంగా జగనన్న గోరుముద్ద మెనరూపొందించారని తెలిపారు. వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మన ముఖ్యమంత్రి గా ఉండడం మన రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టం అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ విద్యా కంటెంట్ తో ట్యాబులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా 4,59,564 మంది విద్యార్థులు, 59,176 మంది ఉపాధ్యాయులు మొత్తం 5,18,740 మందికి ట్యాబు ల విలువ 688 కోట్లు మరియు బైజూస్ ఫ్రీ లోడెడ్ కంటెంట్ విలువ 778 కోట్లు మొత్తం 1,466 కోట్ల రూపాయలు వినియోగించినట్లు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్కారణలకోసం గత మూడున్నర సంవత్సరాలలో వైస్సార్సీపీ ప్రభుత్వం జగనన్న అమ్మఒడీ 44.49 లక్షల మందికి 19,617 కోట్లు, జగనన్న విద్యాదీవెన 24.75 లక్షలమందికి 9,051 కోట్లు, జగనన్న వసతి దీవెన 18.78 లక్షల మందికి 3,349 కోట్లు, జగనన్న విద్యాకానుక 47.72 లక్షల మందికి 2,368 కోట్లు, ట్యాబు ల పంపిణి 5.18 లక్షల మందికి 688 కోట్లు, జగనన్న గోరుముద్ద 43.26 లక్షల మందికి 3,239 కోట్లు, నాడునేడు మొదటి దశ 15,634 స్కూల్స్ 3,669 కోట్లు,రెండవ దశ 22,344 విద్యా సంస్థలు 8,000 కోట్లు, వైస్సార్ సంపూర్ణ పోషణ 34.19 లక్షల మందికి 4,895 కోట్లు, స్వేచ్చా సానిటరీ నాపకిన్స్10.01 లక్షల మందికి 32 కోట్లు మొత్తం 54,910 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినట్లు వివరించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, ఉప విద్యాశాఖాధికారి రఘు , మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు ఎంపీపీ, వైస్ ఎంపీపీలు,కౌన్సిల్లర్లు, ఎంపిటీసీలు, సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర డైరెక్టర్లు, కమిటీల చైర్మన్లు, ఎంపీడీఓ, మండల విద్యాశాఖధికారి, ప్రిన్సిపాల్, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పీలు, తల్లి తండ్రులు, విద్యార్తులు వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గణనాధుని సేవలో కర్ణాటక హైకోర్టు రిజిస్టర్ రాజీవ్ గౌడ

విశాలాంధ్ర - ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం కర్ణాటక హైకోర్టు రిజిస్టర్ రాజీవ్ గౌడ్ కుటుంబసభ్యులతో కాణిపాకం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేచుకుల కోదండ పాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు చేసుకోండి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్ రావు

విశాలాంధ్ర –తొట్టంబేడు: రైతులు ప్రతి ఒక్కరూ తాము పండిస్తున్న పంటల వివరాలను తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తిరుపతి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్ రావు కోరారు. తొట్టంబేడు మండలం చిన్నసింగమాల, బసవయ్యపాళెం గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. అదేవిధంగా ఈ గ్రామాల పరిధిలో రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతులకు పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ పంట రుణాలు, ధాన్యం కొనుగోలు కోసం తప్పని సరిగా రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇక పంట నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ధనుంజయరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎన్.సురేంద్రరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రమ్మ,సుధాకర, చౌడేశ్వరి పాల్గొన్నారు.

హత్య కేసులో ఆరు మంది అరెస్టు

- హంతకులకు రూ.2లక్షల సుపారీ

విశాలాంధ్ర –శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో సంచలనం కలిగించిన భూత వైద్యుడు చంద్రగిరి చంద్రయ్య ఆచారి హత్య కేసులో బుద్ధ హరికృష్ణ (24), కొల్లగుంట సురేష్ (29), గోచి శ్రీనివాసులు (20), కంటిపల్లి గుణశేఖర్ (27), పిడుగు శశికుమార్ (25), పోలేరు మల్లిఖార్జున (48) అనే ఆరు మందిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి మారణాయుధాలు, రెండు ద్విచక్ర వాహ నాలు, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారం రోజుల వ్యవధిలోనే హత్య కేసు చేధించి నిందితులను అరెస్టు చేసిన పోలీసులను శ్రీకాళహస్తి డీయస్పీ విశ్వనాథం అభినందించారు. చంద్ర య్య ఆచారి హత్య కేసులో నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టారు. డీయస్పీ ధర్మవ రపు విశ్వనాథం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ నగర్ లో నివాసం ఉండే చంద్ర య్య ఆచారి భూత వైద్యుడు. ఇతడు ఇటీవల ఉపాధ్యాయ నగర్ లో ఓ ఇల్లు నిర్మించుకుని తన కార్యకలా పాలు నిర్వహించే వాడు. ఇదిలా ఉండగా తొట్టంబేడు మండలం పెద్దకనపర్తికి చెందిన బుద్ధ హరి కృష్ణ, శ్రీకాళహస్తి పట్టణం ముత్తరాసిపాళెంకు చెందిన కొల్లగుంట సురేష్ ఇద్దరూ శ్రీకాళహస్తి అటవీ శాఖ డిపార్టుమెంటులో ఒప్పంద ప్రాతిపదికన వాచర్లుగా పని చేస్తున్నారు. వీరి కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగా లేక పోవడంతో చంద్రయ్య ఆచారిని ఆశ్రయించారు. చంద్రయ్య ఆచారికి డబ్బులు ఇచ్చి పూజలు చేయించారు, వారి ఇంట్లో వారికి మొదట అనారోగ్యం నయమైంది. మళ్లీ కొన్ని రోజు లకే అనారోగ్యం రావడం... ఇంట్లో వాళ్లకి రోడ్డు ప్రమాదాలు కావడంతో ఇవన్నీ సదరు చంద్రయ్య ఆచారి వలనే జరగుతున్నాయని వారు అనుమానించారు. దీనికి తోడు హరికృష్ణ, సురేష్ నుంచి చంద్రయ్య ఆచారి పెద్ద మొత్తంలో డబ్బు డిమాండు చేస్తూ వచ్చాడు. వారిని భయపె ట్టాడు కూడా. సురేష్, హరికృష్ణను, వాళ్ళింట్లో వాళ్ళని చంపేస్తానని బెదిరిస్తుండడంతో చంద్రయ్య ఆచారిని చం పాలనుకుని వారు నిర్ణయించుకున్నారు. ఇందుకు ప్రణాళిక రచించారు. వీరిద్దరూ కలసి సూళ్లూ రుపేట మండలం మన్నారు పోలూరుకు చెందిన గోచి శ్రీనివాసులు, కంటిపల్లి గుణశేఖర్, బుచ్చినా యుడుకండ్రిగ మండలం నెలవాయికి చెందిన పిడుగు శశికుమార్, పోలేరు మల్లిఖార్జునను సంప్ర దించారు. భూతవైద్యుడు చంద్రయ్య ఆచారిని హత్య చేసేందుకు రూ.2లక్షలకు ఒప్పందం కుదుర్చుకు న్నారు. వీరందరూ కలసి ఈ నెల 21వ తేదీన సుమారు ఉదయం 10.50గంటల ప్రాంతంలో చంద్రయ్య ఆచారి హత్య చేశారు. చంద్రయ్య ఆచారి కొడుకు చంద్రగిరి రుద్ర, ఇచ్చిన ఫిర్యాదుపై శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ భాస్కర్ నాయక్ క్రైమ్ నంబరు: 160/2022 అడర్ సెక్షన్ 302 ఐపీసీ కేసు నమోదు చేశారు. చంద్రయ్య ఆచారిని చంపిన వారిని పట్టుకోడానికి తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి పర్యవేక్షణలో, శ్రీకాళహస్తి డీయస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ భాస్కర్ నాయక్, బీయన్ కండ్రిగ సీఐ విక్రమ్ ను రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశారు. నిందితులను వీరు బుధవారం ఉదయం 11గంటలకు బుద్ధ హరికృష్ణ, రమేష్ ను శ్రీకాళ హస్తి పట్టణ శివారులోని ఎంజీఎం అస్పత్రి కూడలి వద్ద... మిగిలిన నలుగురు నలుగురు నింది తులైన శ్రీనివాసులు, గుణశేఖర్, శశికుమార్, మల్లిఖార్జునను మధ్యాహ్నం 2.45గంటలకు బీయన్ కండ్రిగ వికాస్ జూనియర్ కళాశాల వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్ళు, రెండు కత్తులు, రెండు కోడి కత్తులు, ఐదు సెల్ ఫోన్ లు, రూ.2వేలు నగదు స్వాధీనం చేసుకు న్నారు. కాగా ఈకేసు లో నిందితులను పట్టుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ చూపించిన శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ భాస్కర్ నాయక్, బీయన్ కండ్రిగ సీఐ విక్రమ్, ఎస్ఐలు మహేష్ బాబు, మంజునాథ రెడ్డి, రాఘవేంద్ర, ఏఎస్ఐ యువరాజులునాయుడు, హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుళ్లు నందకు మార్, కిషోర్,శ్రీనివాస రావు, నాగభూషణం, బాబు, మహేష్, హెూమ్ గార్డ్ మునేంద్ర, దేవరా జులు, మాధవనుతిరుపతిఎస్పీపరమేశ్వరరెడ్డి, శ్రీకాళహస్తి డీయస్పీ విశ్వనాథం రివార్డులతో అభినదించారు.

మహిళా వర్శిటిలో రెండవ రోజు పర్యటించిన నాక్ బృందం

పూర్వ విద్యార్థులతో సంభాషణ -వివిధ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలన

- వర్శిటి ప్రాంగణంలో చెట్లు నాటిన న్యాక్ బృందం

విశాలాంధ్ర -తిరుపతి ఎస్వీయూ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రెండవ రోజు నాక్ బృందం పర్యటించింది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడు ఉపకులపతి ఆచార్య ముత్తు కలింగం కృష్ణన్ చైర్పర్సన్‌గా, ది మహారాజా సయాజి రావ్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా అధ్యాపకులు ఆచార్య హర్ష వటాటియ మెంబర్ కోఆర్డినేటర్ గా, పంజాబ్ యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య మౌనిక చావ్లా, దేవి అహల్య విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య సుధీరా చందేల్, వనస్థలి విద్యాపీట్ డీన్ ఆచార్య సీమ వర్మ, బెనారస్ హిందూ యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య ప్రియాంక గీత సభ్యులుగా ఉన్న న్యాక్ బృందం బుధవారం మహిళా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీలు పొంది వివిధ సంస్థలలో పనిచేస్తున్నటు వంటి పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడటం జరిగింది. యూనివర్సిటీలో అనుభవాలు, యూనివర్సిటీ గురించి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. హెూమ్ సైన్స్, సెరికల్చర్, ఉమెన్ స్టడీస్ సెంటర్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. యూనివర్సిటీ హాస్టల్ లను పరిశీలించి అక్కడ ఉన్నటువంటి విద్యార్థినులను వసతి సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వర్సిటీలోని ఇంక్యు బేషన్స్, నూతన ఆవిష్కరణలు, ప్లేస్మెంట్ సెల్, ఐక్యూఏసి సెల్ ను సందర్శించారు. యూనివర్సిటీ ప్రాంగ ణంలో న్యాక్ బృందం చెట్లు నాటటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య దువ్వూరు జము న, రిజిస్ట్రార్ ఆచార్య డి. ఎం. మమత, వివిధ విభాగాల డీన్లు, ఐక్యూఏసి సభ్యులు పాల్గొన్నారు.

హెల్త్ సైన్సెస్,పారామెడికల్,నర్సింగ్ కోర్సులు చేసినవారికి ఉద్యోగ అవకాశాలు మెండు

- పీ.ఈ.ఎస్ ప్రిన్సిపాల్ డా.కృష్ణారావు

విశాలాంధ్ర - కుప్పం : పీ.ఈ.ఎస్ వైద్య కళాశాల నందు బుదవారం 2022 - 23 విద్యా సంవత్సరం, మొదటి సంవత్సర హెల్త్ సైన్సెస్, పారామెడికల్, నర్సింగ్ కోర్సుల తరగతులను పీ.ఈ.ఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా.కృష్ణారావు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.కృష్ణారావు మాట్లాడుతు పీ.ఈ.ఎస్ వైద్య కళాశాల ఎంచుకున్నందుకు, విద్యార్థులకు వారి తల్లితండ్రులకు శుభాకాంక్షలు తెలిపుతూ అల్లైడ్ హెల్త్ సైన్సెస్, పారామెడికల్, నర్సింగ్ కోర్సులు పూర్తి చేసినవారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నా యన్నారు. పీ.ఈ.ఎస్ వైద్య కళాశాల కు ఎన్.ఏ.బి.ఎల్ ఆక్రెడిటేషన్ ఉన్నందున పీ.ఈ.ఎస్ వైద్య కళా శాలలో చదివిన విద్యార్థులు బెస్ట్ టెక్నీషియన్, నుర్సులుగా తయారవుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. సుబ్బారావు, పీ.ఈ.ఎస్ ఫీజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపాల్ బిజిష్ కుమార్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ బలాలక్ష్మి, నర్సింగ్ కాలేజీ అడ్వైసర్ డా. విశ్వేశ్వర రెడ్డి, అన్నివిభాగ అధిపతులు, అధ్యాపకులు, నూతన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య పురస్కారాన్ని అందుకున్న ఉపాధ్యాయులు పల్లిపట్టు నాగరాజు

విశాలాంధ్ర– సత్యవేడు: సత్యవేడు మండలం రాజగోపాలపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పల్లిపట్టు నాగరాజు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని అందుకున్నారు. మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ సెక్రటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పల్లిపట్టు నాగరాజు సాహిత్య అకాడమీ వైస్ చైర్మన్ మాధవ్ కౌశిక్,ప్రముఖ హిందీ రచయిత్రి మమతా కాళీ చేతుల మీదుగా 2022 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని అందుకోవడం జరిగింది. పల్లి పట్టు నాగరాజు రచించిన "యాలై పూడ్సింది " అనే కవిత సంపుటికి గాను కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని ఆగస్టు 25వ తేదీన ప్రకటించింది.ఈ నేపథ్యంలో రాజగోపాలపురం గ్రామానికి చెందిన పల్లిపట్టు నాగరాజు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని అందుకోవడం జరిగింది.ఈ పురస్కారం కింద 50వేల రూపాయలు నగదు, అకాడమీ మెమొంటోను సాహిత్య అకాడమీ వైస్ చైర్మన్ మాధవ్ కౌశిక్ అందించారు.కాగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్న పల్లిపట్టు నాగ రాజు ప్రస్తుతం శాంతిపురం మండలం 64 పెద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచే స్తున్నారు.సామాజిక రుగ్మతలపై పల్లిపట్టు నాగరాజు రచించిన పలు కవిత రచనలలో సమాజాన్ని చైతన్యం పరిచే విధంగా ఉన్నాయి.కవిత రచన సంపుటిలోను వాడుకు భాష ఉట్టి పడేవిధంగా రచనలు కొన సాగించడం పల్లిపట్టు నాగరాజు ప్రత్యేకతగా పేర్కొనవచ్చు.కాగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కా రానికి ఎంపికైన సందర్భంగా ఉపాధ్యాయులు పల్లిపట్టు నాగరాజును సెప్టెంబరు 28వ తేదీన శ్రీసిటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీ సిటీ ఎండి రవీంద్రసన్నారెడ్డి ఘనంగా సన్మానించారు. సామాజిక రుగ్మతలపై సమాజాన్ని మేల్కొల్పే విధంగా కవిత సంపుటిని రచించిన పల్లిపట్టు నాగరాజు ఈ ప్రాంతం ఆణిముత్యం అన్నారు.కవిత రచనలో పల్లిపట్టు నాగరాజుకు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

'డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ఫ్యామిలీ ఫౌండేషన్' సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ శాంతిరెడ్డి శ్రీసిటీ సందర్శన

విశాలాంధ్ర– సత్యవేడు: అమెరికా కాలిఫోర్నియా విక్టర్‌విల్లేలోని ప్రముఖ వైద్యురాలు, 'డాక్టర్ ప్రేమ్ రెడ్డి ఫ్యామిలీ ఫౌండేషన్' సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ శాంతి రెడ్డి శ్రీసిటీని సందర్శించారు.ఇతర వ్యాపారవేత్తల బృందంతో వచ్చిన ఆమెకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రత్యేకతలు, పారిశ్రామిక అభివృద్ధి, అపార ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు.శ్రీసిటీ ప్రాజెక్ట్ అమలు తీరు పట్ల హర్షం వ్యక్తం చేసిన డాక్టర్ శాంతి, శ్రీసిటీ బృందం కృషిని అభినందించారు. వెనుకబడిన ప్రాంతాన్ని మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్చడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని అభినందిస్తూ, స్థానికులకు ముఖ్యంగా మహిళలకు పుష్కలంగా ఉద్యోగాలు కల్పించడాన్ని ఆమె ప్రశంసించారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక నగరాన్ని నిర్వహించడం అంత తేలికైన పని కాదన్న ఆమె, దేశంలోనే అత్యంత అనుకూల పెట్టుబడి కేంద్రంగా శ్రీసిటీని అభివృద్ధి చేసినందుకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.శ్రీసిటీని సందర్శించినందుకు అతిథులకు కృతజ్ఞతలు తెలిపిన డా. రవీంద్ర సన్నారెడ్డి, డాక్టర్ శాంతి రెడ్డి, ఇతర వ్యాపారవేత్తల బృందం శ్రీసిటీ కి రావడం అరుదైన గౌరవంగా భావిస్తున్నాము అన్నారు. వారి పరిశీలనలు అభిప్రాయాలు తమకు చాలా విలువైనవి అని పేర్కొన్నారు. ముందురోజు డాక్టర్ ప్రేమసాగర రెడ్డికి 'విశ్వ వైద్య విభూషణ్' బిరుదునిచ్చి నెల్లూరులోఏర్పాటుచేసిన పౌరసన్మానసభలో తాను పాల్గొనిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తిచేసుకుంటూ, 'డాక్టర్ ప్రేమ్ రెడ్డి ఫ్యామిలీ ఫౌండేషన్' ద్వారా పేద ప్రజలకు వైద్యపరంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. శ్రీసిటీ పరిసరప్రాంతంలోవైద్య వసతులు మరింత మెరుగుపరిచేం దుకుసహకరించాలనిశాంతిరెడ్డికివిజ్ఞప్తి చేశారు.అనంతరం వారు శ్రీసిటీ పరిసరాలతో పాటు, యం.ఎస్.ఆర్ గార్మెంట్స్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు.కాగా, డాక్టర్ శాంతి రెడ్డి హెల్త్‌కేర్ విజనరీ, ప్రైమ్ హెల్త్‌కేర్ చైర్మన్ మరియు అమెరికాలోని డాక్టర్ ప్రేమ్ రెడ్డి ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రెసిడెంట్, సీఈవో డాక్టర్ ప్రేమ్ సాగర్ రెడ్డి భార్య. ఈ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య విద్య, కళాశాల స్కాలర్‌షిప్‌లు, పబ్లిక్ హెల్త్‌కేర్ ఎడ్యుకేషన్ మరియు ఉచిత కమ్యూనిటీ క్లినిక్‌లు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలకు మిలియన్ల డాలర్లను విరాళంగా ఇచ్చారు. ఈ దంపతులు భారతదేశంలోని అనేక స్వచ్ఛంద సంస్థలకు కూడా పెద్ద ఎత్తున ఉదారంగా సాయం చేశారు.

బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలోనే చియ్యవరం అభివృద్ధి

-టీడీపీ రాష్ట కార్యదర్శి గాలి చలపతినాయుడు

విశాలాంధ్ర–తొట్టంబేడు: చియ్యవరం అభివృద్ధి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పోతుగుంట గురవయ్యనా యుడు హయాంలో మాత్రమే జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు చెప్పారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధ వారం తొట్టంబేడు మండలం చియ్యవ రంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహిం చారు. గాలి చలపతినాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను టీడీపీ నేతలకు వివరించారు. తమ గ్రామంలో సుమారు 30మందికి పింఛన్లు రద్దు చేయడానికి నోటీసులు ఇచ్చారన్నారు. ఇది చాలా దారుణమైన నిర్ణయమన్నారు. టీడీపీ హయాంలో ఈ సమస్యలు ఉండేవి కావన్నారు. సిమెంటు, తారు రోడ్డు నిర్మాణము, మంచినీటి బోర్లు, ఇండ్ల నిర్మాణము తదితర అభివృద్ధి పనులు తెలుగుదేశం హయాంలోనే జరిగాయన్నారు. అంతేకాకుండా స్కూలు భవన నిర్మాణము, కాంపౌండ్ వాల్, తరగతి గదులు, అంగన్వాడీ స్కూల్ బిల్డింగ్ తెలుగుదేశం హయాంలోనే జరిగాయన్నారు. చియ్యవరం పంచాయతీ అంటే తెలుగుదేశానికి కంచుకోటని ఒక్క ఛాన్స్ పేరుతో అంతా మోసపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు విపరీతంగా పెంచడంతో తమ బతుకులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఈ సందర్భ ంగా గాలి చలపతినాయుడు మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం తధ్యమన్నారు. అందరూ కలిసికట్టుగా పార్టీకి పనిచేసి బొజ్జల సుధీర్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు, గ్రామ నాయకులు కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ రామయ్య, మాజీ సర్పంచ్ పెంచలయ్య, వెంకట రామానాయుడు, గుర్రప్ప, వెంకటయ్య, వేమాలయ్య, వెంకటేష్, మాజీ పార్టీ అధ్యక్షులు భాస్కర్ నాయుడు, చంద్రారెడ్డి, బీసీ నాయకులు రాఘవులు, ఎస్సీ నాయకులు వెంకటసుబ్బయ్య, సాలి రాజా తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు పెన్షనర్స్ ఐకమత్యం వారి సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తి దాయకం

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ :పుత్తూరు మండల పరిధిలో చిత్తూరు జిల్లా ఖజానా అధికారి లక్ష్మిఖర్ రెడ్డి. ప్రభుత్వ పింఛిందారుల భవనం పుత్తూరు లో జరిగిన జాతీయ పెన్షనర్స్ దినోత్సవ వేడుకల కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలు అన్నింటినీ పరిష్కరిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రతాప్ సింగ్ భక్తి గీతాల ను ఆలపించారు. 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా 20 మందికీ పైగా రిటైర్డ్ ఉద్యోగులు ను సన్మానించారు. కి చెందిన వృద్ధులు కు చీరలు వితరణచేశారు. కీర్తి శేషులు శ్రీనివాసులు మరియు పద్మనాభం శ్రద్ధాంజలి ఘటించారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం జిల్లా రాష్ట్ర బాధ్యులు జయరామి రెడ్డి,పద్మనాభ శెట్టి,వెంకట్ రావు, రాజేంద్ర నాయుడు ను సన్మానించారు ఆ. ప్ర.ప్ర.రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర బాధ్యులు గురురాజ రావు జిల్లా బాధ్యులు శంకర్,జయరామా నాయుడు, వెంకటేశ్ ప్రసంగించారు. నగరి ,సత్యవేడు ,కార్వేటి నగరం సంఘ బాధ్యులను సన్మానించారు. దొరస్వామి రాజు, రామచంద్రయ్య, రామమూర్తి భోజన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గుణశేఖర్ రెడ్డి, భాస్కర్ రాజు,కుప్పయ్య, చంద్ర శేఖర్ వర్మ,, చంద్ర శేఖర్ రెడ్డి నారాయణ రెడ్డి,కృపావరమ్మా , రవిశంకర్,రామచంద్ర రాజు, శంకరయ్య,రామలింగం, వెంకటకృష్ణ ,మేకల సుబ్రమణ్యం, వేలు,చిరంజీవి,వర్మ,బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను బుధవారం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరదరాజస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలా ంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆలయ ఉద్యోగులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయాలని చెప్పారు. అదేవిధంగా విద్యుత్ దీపాలతో అలంకరణ చేయాలని సూచించారు. ప్రస్తుతం జీర్ణోదరణ పనులు చేయడానికి బాలాలయం చేసి ఉన్న కారణంగా ఉత్సవ మూర్తిని దర్శించుకునేందుకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. వరదరాజస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు త్వరగా చేపట్టే విధంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీ ఈ శ్రీని వాసులురెడ్డి ,వర్క్ ఇన్స్పెక్టర్ సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చివరి విద్యార్థికి గుణాత్మక విద్య అందించడమే జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు



విశాలాంధ్ర - ఐరాల: రాష్ట్రంలో విద్యార్థుల కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని తన భుజాన వేసుకొని విద్యార్థులు పాఠశాలలో చేరినప్పటి నుండి విద్య పూర్తయ్య వరకు సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఖర్చులతో చదివిస్తున్నాడని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. పూతలపట్టు మండలం పి కొత్తకోట ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండలంలోని 11 హైస్కూల్లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు544 ట్యాబ్స్ ను పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు విజ్ఞానవంతులైతే గ్రామాలు అభివృద్ధి పదంలో నడుస్తాయని నాడు- నేడు నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేశారని దేశంలో విద్యకు. ఆరోగ్యానికి ప్రాధాన్యతిస్తున్నది మన ముఖ్యమంత్రి వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాల గురించి తల్లిదం డ్రులకు తెలియజేయాలన్నారు. గతంలో పరిపాలించిన ప్రభుత్వాలు విద్యను గురించి పట్టించుకోలేదన్నారు ఈ టాబ్స్ ద్వారా విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడి ఉన్న ప్రస్తాయికి ఎదగాలన్నారు. సర్పంచ్ పద్మజరాణి మాట్లాడుతూ విద్యతోనే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని దీన్ని దృష్టిలో పెట్టుకొని మన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతిస్తున్నదని విజ్ఞానం ఉంటే మనిషి ఎక్కడైనా జీవనం సాగించవచ్చునని డిజిటల్ విప్లవం కోసం సీఎం టాబ్స్ ను పంపిణీ చేశారన్నారు. పి కొత్తకోట పంచాయతీ పరిధిలో చుట్టుపక్కల గ్రామాల్లో అధికంగా విద్యార్థులు ఉన్నారని పి .కొత్తకోటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలకు అదనపు గదులు మంజూరు చేయాలని హెచ్. ఎం. రమేష్ బాబు ఎమ్మెల్యేని కోరాడు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు పెనుగొండ వైసీపీ పరిశీలకులు తలుపులపల్లి బాబు రెడ్డి. సర్పంచుల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి. కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి . వైసీపీ సీనియర్ నాయకుడు రాజారత్నం రెడ్డి .సర్పంచులు ఎమ్మెస్ మనీ. ప్రవీణ్ కుమార్. ఎంపీటీసీలు దేవిక.చైతన్య రెడ్డి. ద్వారకనాథరెడ్డి. రాణమ్మ. ఎంపీడీవో గౌరీ. తాసిల్దార్ విజయభాస్కర్. మండల కోఆప్షన్ సభ్యులు ఖాదర వల్లి. సింగల్ విండో అధ్యక్షులు దొర స్వామి రెడ్డి.నాయకులు అమర్నాథ్ రెడ్డి. ఎస్బిఐ లోకేష్ రెడ్డి. సుధాకర్ రెడ్డి. త్యాగరాజులు. గోవిందరాజులు. నాగరాజు. ప్రభాకర్ రెడ్డి. బాలాజీ. నవీన్ రెడ్డి. నిరంజన్ రెడ్డి. సుబ్రహ్మణ్యం. షణ్ముగం. అర్జున్. మీడియా కోఆర్డినేటర్ ఉమాపతి. ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు విద్యార్థులు. విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ...

నారాయణపురంను పట్టించుకోండి

- జ్వరాలతో తల్లడిల్లుతున్న ప్రజలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న నారాయణపురంలో ప్రజలు జ్వరాలతో తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వాలు మారినా... పాలకులు మారినా నారాయణపురంను పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ గ్రామంపై అధికారులు సవతిప్రేమ చూపుతున్నారు. అభివృద్ధి మాట దేవుడెరుగు. ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్య ంగా నారాయణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎన్నో ఏళ్లుగా సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ సమస్యలు తీర్చడంలో పాలకులు విఫలమయ్యారు. నిత్యం కూలీ పనులకు వెళ్లి జీవనంసాగించే దళితుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. ఇటీవల కాలంలో నారాయణపురం గ్రామంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబ లాయి. అయినా అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. సచివాలయ ఉద్యోగులు అసలే పట్టించు కోరు. శ్రీకాళహస్తి మండలంలో పెద్ద పంచాయతీగా నారాయణపురం ఉంది. ఈ పంచాయతీ పరిధిలో నారాయణపురం గ్రామంతో పాటు పెంకులపాడు, జింగిలి పాలెం, సమీపంలోని యానాది సెంటర్ మూడు గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో సమస్యలు కుప్పలు కుప్పలుగా ఉన్నా యి. వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో ఉన్నా కార్యాల యంకే పరిమితం అవుతున్నారు. ప్రజల బాగోగులు గురించి పట్టించుకోవడం లేదు. సచివాలయాలు ఏర్పాటు చేసినా సమస్యలు మాత్రం పరిష్కరించడంలో సిబ్బంది విఫలమ వుతున్నారు. వీరి వ్యవహార శైలి సరిగా లేదనే విమర్శ బలంగా ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డికి తప్పకుండా చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉంది. ఇకనైనా స్పందించి నారాయణపురంలో సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

పేదల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-ఓజీలి: పేదల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కిలి వేటి సంజీవయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మండలంలోని ఆర్మేని పాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి పేదల కోసం ప్రవేశపెట్టిన నవ రత్నాలు పథకం అర్హులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని ఎవరైనా ఉంటే కచ్చితంగా వారికి న్యాయం చేస్తామని వారు తెలియజేశారు. అనంతరం ఆయన హై స్కూల్ ఆవరణములో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ,బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేస్తూ వారి అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధి గా పనిచేస్తున్నారన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో విద్యకు సీఎం పెద్దపెట వేశారన్నారు అందులో భాగంగానే విద్యార్థిని, విద్యార్థులకు ట్యాబులు కూడా పంపిణీ చేయడం జరిగింది ఆయన పేర్కొన్నారు. అంతకు మునుపు ఎమ్మెల్యే సంజీవయ్యకు జడ్పీటిసి మరియు మండల వైకాపా అధ్యక్షులు గుంటమడుగు రవీంద్ర రాజు, సుకుమార్ రాజు గజమాల వేసి శాలవా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు గద్దం రమణారెడ్డి మండల వైకాపా నాయకులు దేశి రెడ్డి మధు రెడ్డి, పుచ్చూరు హరినాథ్ రెడ్డి, కొండూరు వామన రాజు, కొండూరు దామోదర్ రాజు, ఆర్మేనుపాడు ఎంపీటీసీ గుంటమడుగు రఘురామరాజు, కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాషా, సర్పంచ్ ,ఓజిలి తాహసిల్దార్, ఎంపీడీవో రజనీకాంత్, పార్టీ నాయకులు ,కార్యకర్తలు అధికారులు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల పింఛన్లు అవుట్: జనసేన

విశాలాంధ్ర - వెంకటగిరి : ఉమ్మడినెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోప్రెస్ మీట్ నిర్వహించడం జరిగిందిజగన్మోహన్ రెడ్డి బర్త్ డే గిఫ్ట్ అవ్వ తాతల పింఛన్లు రద్దు చేయడ దారుణమని అన్నారుఅవ్వ,తాత పింఛన్లు రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ప్రభుత్వం 2లక్షల మంది పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం మొండి చేయి చూపిస్తూ పింఛన్లు ఎత్తేయటం చాలా దారుణమైన విషయం అవ్వ తాతలు రాష్ట్రవ్యాప్తంగా వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన దగ్గర నుంచి మూడు విడతలగా కరెంటు చార్జింగ్ ను పెంచి ఇంటి పన్ను ,వాటర్ పెన్ను, టాక్స్ పే చేస్తున్నారు, మూడు 2 ఎకరాల నుంచి 3 ఎకరాల వరకు పొలం ఉన్నవారికి 300 యూనిట్లు కరెంటు బిల్లు పైబడిన వారికి పెన్షన్ తీసేస్తున్నామని చెప్పి నోటీసులు పంపించడం చాలా దారుణమైన విషయం మరలా వాళ్ళ వెరిఫికేషన్ చేసి 15 రోజుల్లో అర్హులైన వారికి పెన్షన్ ఇస్తామని చెప్పటం చాలా దారుణమైన విషయం ఎన్నికల ప్రచార భాగంలో ఏరోజైనా 300 యూనిట్లు పై కరెంటు వాడిని వారికి టూ వీలర్స్ త్రీ వీలర్స్ ఫోర్ వీలర్స్ వెహికల్స్ ఉన్నాగాని మూడు ఎకరాల పైనున్న రైతులు గాని పెన్షన్ ఇవ్వనని చెప్పి నువ్వు ఎన్నికల ప్రచారంలో ఏమన్నా చెప్పావా ఆరోజు రాష్ట్రం మొత్తం తిరిగి అవ్వ తాతల కి ముద్దులు పెడుతూ కులం చూడడం మతం చూడు ప్రాంతం చూడమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అవ్వ తాతలకు వితంతువులకి ముద్దులు కాకుండా బుద్ధులు గుద్దుతున్నటువంటి జగన్మోహన్ రెడ్డి రాబోయే రోజుల్లో 2024లో కచ్చితంగా బడుగు బలహీన వర్గాలు ఓటుతో బుద్ధి చెప్తారు అని చెప్పి జనసేన పార్టీ ఆశిస్తుంది. వైసీపీ పార్టీకి ప్రకటిం చిన పథకంలో ప్రతి సంవత్సరం ప్రజలకి ఏదో ఒక విధంగా కోత కోస్తున్నాడు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలి

విశాలాంధ్ర : ఎర్రవారిపాలెం : ఎర్రవారిపాలెం మండలం లోగల ఎల్లమంద పంచాయతీలో బుధవా రం గ్రామ సచివాలయం,జడ్పీ ఉన్నత పాఠశాల,ఎలిమెంటరీ పాఠశాల,హాస్పిటల్ మరియు బోడేవాం డ్లపల్లిలో గల గ్రామ సచివాలయం,ఉన్నత పాఠశాల ఎంపీడీఓ అమర్నాథ్ సార్ మరియు ఎంపీపీ శ్రీమతి శివలక్ష్మి సందర్శించి ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయో లేదో కనుక్కొని అం దని వారికి అందేలా చూడాలని కోరుకున్నారు మన గవర్నమెంట్ లో ఎవరికి ఎటువంటి సందేహాలు ఉన్న సమీపంలో ఉన్న వాలంటరీలు కానీ సచివాలయ సిబ్బందిని కానీ అడిగి వారి సందేహం నివృత్తి చేసుకోవచ్చు అని సూచించారు దీనికి సర్వదా సహకరిస్తున్న ఎర్రవారిపాలెం ఎంపీడీఓ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అని తెలియజేసారు.

రాజీవ్ నగర్‌లో మౌళిక వసతులు కల్పించండి: అభివృద్ధి సాధన కమిటీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్ లో మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని రాజీవ్ నగర్ అభివృద్ధి సాధన కమిటీ డిమాండ్ చేసింది. రాజీవ్నగర్ వద్ద కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం రాజీవ్ నగర్ ఏర్పడిందన్నారు. సుమారు 5 వేలకు పైగా నిరు పేద కుటుంబాల వారు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నా రాజీవ్ నగర్ తలరాత మాత్రం మారడం లేదని వాపోయారు. ఇన్నే ళ్లు గడుస్తున్నా కనీసం ఇక్కడ బడి, గుడి, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక వైద్య కేంద్రం, ఓ కమ్యూ నిటీ హాలును ఏర్పాటు చేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు, సరైన తాగునీటి వసతి లేక రాజీవ్‌నగర్ కాలనీవాసులు పడరాని పాట్లుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి కూతవేటుదూరంలోనే రాజీవ్‌నగర్ ఉన్నా కన్నెత్తి చూసే నాధుడే కరువ య్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగో ఏడాదికిలోకి అడుగుపె డుతున్నా రాజీవ్ నగర్ సమస్యలు ఏమాత్రం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తి-పిచ్చా టూరు రోడ్డు నుంచి రాజీవ్ నగర్ ఓవర్ హెడ్ ట్యాంక్ వరకు పేరుకు మాత్రమే 100 అడుగుల రోడ్డు వేశారని... కానీ దాని బాగోగులు మాత్రం మరిచారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సీసీ రోడ్డు వేయించాలని డిమాండు చేశారు. అదేవిధంగా రాజీవ్‌నగర్‌లో మౌళిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చెప్పడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. రాజీవ్‌నగర్ అభివృద్ధి సాధన కమిటీ సభ్యులు గెడి వేణు, సురేష్, మారయ్య,కుప్పమ్మ, నిర్మల, కృష్ణయ్య, దాము, మునిరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో బైకును ఢీ కొట్టిన సుమో

- చిన్నారికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - తిరుమల : తిరుమలలో బుధవారం అతివేగంగా వెళ్లిన సుమో బైకును ఢీకొట్టిన సంఘటనలో 9 ఏళ్ల బాలిక గాయపడింది. స్థానిక బాలాజీ నగర్ కి చెందిన హిందూ ప్రియ ఎస్వీ హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది. ఉదయం స్కూల్ కి వెళ్తున్న సమయంలో ప్రమా దానికి గురై రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాలిక తండ్రి బైక్ పై స్కూలుకి తీసుకెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. బాలికను వెంటనే చికిత్స నిమిత్తం అశ్విని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాలికను తిరుపతికి తరలించారు. ప్రస్తుతం తిరుపతిలో చికిత్స పొందుతోంది. తను కోలుకోవడానికి మరో ఆరు నెలలు సమయం పట్టే అవకాశం ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అయితే తరచూ బాలాజీ నగర్ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లలు స్కూలుకు వెళ్లి వచ్చే సమయాలలో ప్రమాదాలు జరగడం అందరినీ కలవరపరుస్తోంది. వాహనాలు వేగంగా నడపడం కారణంగానే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా టీటీడి అధికారులు, పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకటగిరిని నిజమైన మున్సిపాలిటీ హంగులతో తీర్చిదిద్దుతా : ఆనం

విశాలాంధ్ర - వెంకటగిరి : వెంకటగిరి మున్సి పాలిటీ 12వ సచివాలయ పరిధిలో "గడపగడపకు - మన ప్రభుత్వం" కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనం మాట్లాడుతూ ముఖ్యమంత్రివర్యులు వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఆర్థిక శాఖా మాత్యులు, వెంకటగిరి శాసనసభ్యులు, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఆనం రామనారాయణ రెడ్డి వెంకటగిరి మున్సిపాలిటీ పాతకోట 12వ సచివాలయ పరిధిలోని 23, 24 వార్డులలో "గడపగడపకు - మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని నిర్వ హిం చారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేని.23, 24 వార్డుల ప్రజలు, సచివాలయ సిబ్బంది, స్థానిక చేనేతన్నలు భాజా భజంత్రీలతో, మహిళా మణుల పూల జల్లులతో అపూర్వ స్వాగతం పలికారు. చేనేత న్నలు శాలువా కప్పి, గజమాలతో ఎమ్మెల్యే ఆనం ఆత్మీయంగా సత్కరించారు. "గడప గడపకు - మన ప్రభు త్వం" కార్యక్రమంలో భాగంగ వెంకటగిరి మున్సిపాలిటీ పాతకోట 12వ సచివాలయ పరిధి లోని 23, 24 వార్డుల లోని పలు నివాసాలకు వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించి..గత మూడున్నర సంవత్సరా లుగా ముఖ్యమంత్రి వైఎస్ .జగన్ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం "నవరత్నాలు", "వైయస్సార్ సంక్షేమ పథకాలను" ప్రవే శపె ట్టి.ఈ మూడున్నర సంవత్సరాలలో సంక్షేమ పథ కాల అమలు తీరు, తెన్నులు తెలుసు కునేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మీ వద్దకు మమ్మల్ని పంపారని ఎమ్మెల్యే ఆనం వారికి వివరించారు. మీలో ఎవరికైనా సాంకేతిక లేదా ఇతర కారణాలవల్ల సంక్షేమ పథకాలు అందకపోతే, మీరు మళ్ళీ స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవ చ్చని, అట్టి దరఖాస్తులను తాను పరిశీలించి.ముఖ్యమంత్రి వైఎస్. జగన్ కార్యాలయానికి పంపిస్తామని.తేలిపారు.

రైతులకు ఎరువుల కొరతపై నిరసన: జనసేన

విశాలాంధ్ర - వెంకటగిరి : వెంకటగిరి నియోజకవర్గంలోని యూరియా, పాస్పెట్ కొరతపై మరియు ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని మరియు వైసీపీ నాయకులు, రైతు భరోసా కేంద్రాలులో ఉన్నటువంటి మెంబర్ని బెదిరించి యూరియా మరియు పాస్పోర్ట్‌ని పేద మధ్య తరగతి రైతులకి అందకుండా ఇష్టానుసారంగా వందల బస్తాలు తీసుకెళ్లి వాళ్లకి అనుకూలమైన రైతులకి అందజే స్తున్నారు. కానీ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవ హరిస్తున్నారని జనసేన పార్టీ నిరసన తెలియజేయడం జరి గింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అయినా కాకాని గోవర్ధన్ రెడ్డి రాష్ట్ర మొత్తం మీద జరుగుతున్న ఈ ఎరువుల దందాని నియంత్రించి అర్హులైన రైతులకు అందజేయ వలసినదిగా జనసేన పార్టీ కోరుకుంటుంది. ఈకార్యక్రమంలో భాగంగాపై విషయాలపై అగ్రికల్చర్ వినతి పత్రాలు అందజేయడం జరిగింది. ఎరువుల కొరతపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ కోరుకుం టుంది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నెల్లూరు జిల్లా ఉమ్మడి ప్రధా న కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు, రాష్ట్ర చేనేత విభాగ కార్యదర్శి చింతగింజల వెంకటరమణ, జిల్లా కార్యదర్శి చమ్మండి రాధమ్మ, జనసేన పార్టీ వెంక టగిరి పట్టణ అధ్యక్షుడు రామారావు అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు లక్ష్మీ కాంత్, ప్రధాన కార్యదర్శి సూరయ్యపాలెం శేఖర్, మైనార్టీ నాయకుడు రిజ్వానా భాష, వెంకటేష్ జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి బాలయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో విద్యార్థులకు ఈ ట్యాబ్‌లు అందజేసిందన్నారు. డిజిటల్ విధానంలో బోధన జరగాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవడం వలన భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు న్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ దేవరాజులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరాలయంలో అభివృద్ధి పనులు పరిశీలన

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా తొట్టంబేడు మండల పరిధిలో గల అర్ధనా రీశ్వర ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి అర్ధనారీశ్వరాలయం పునర్నిర్మాణంపై చర్చించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థపతి సలహాలతో సుమారు కోటి రూపాయలు వెచ్చి ంచి ఆలయాన్ని ఆధునిక సదుపాయలతో... ఆధ్యాత్మిక శోభ చేకూరేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీఈ శ్రీనివాసులురెడ్డి, స్థపతి కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ సూర్య ప్రకాష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యం

-డాక్టర్ సముద్రాల బత్తెయ్య నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సముద్రాల బత్తెయ్యనాయుడు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శ్రీకాళహస్తిలో బుధవారం ఘనంగా నిర్వహిం చారు. కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బత్తెయ్యనాయుడు మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ ఎంతో కీలకమైందన్నారు. కాంగ్రెస్ నేతలు ఎంతో మంది ప్రాణ త్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం సంపాదించారని చెప్పారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో పేదరికం నిర్మూలించడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంస్కరణలు తీసుకొ చ్చిందన్నారు. దేశ ప్రజల కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారన్నారు. ప్రస్తుతం భారత దేశాన్ని మత చాంధసు వాదుల నుంచి రక్షించడానికి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఆయన 2,800కి.మీ. దూరం పాదయాత్ర చేశారన్నారు. ఈ జోడో యాత్రలో ఆయన అనేక అంశాలు తెలుసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం పాదయాత్ర తాత్కాలిక విరామం ఇచ్చారని... వచ్చే నెల 3వ తేదీ నుంచి మళ్లీ భారత్ జోడో యాత్ర ప్రారంభమవు తుం దన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీనేతలు ఎస్‌కే జానీ భాషా, బీవీ శేఖర్, ఈర్ల గోపి, నాగూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - ఏర్పేడు : మండలం కోబాక పంచాయతీలో నీ ఎస్టీ కాలనీ నందు ఇంటింటికి వెళ్లి మహిళల్ని వృద్ధుల్ని యువకుల్ని అన్ని వర్గాల ప్రజల్ని కలిసి ఈ మూడున్నర సంవత్సరం వైసీపీ జగన్ మోహన్ రెడ్డి పరిపాల నలో ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారో వ్యక్తిగతంగా తెలియపరుస్తూ నిరుద్యోగ సమస్య మీద అడ్డగోలు నిత్యవసర ధరల మీద మద్యపానం మాదక ద్రవ్యాలు పెచ్చుమెరడం మీద కుంటుపడిన అభివృద్ధి స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమంగా తరలించడం మీద అవినీతిపై మహిళల భద్రతపై కరెంటు చార్జీలు ఆర్టీసీ చార్జీలు పెంపుదలపై రోడ్లు దెబ్బతిన్న అంశాలపై స్థానిక సంస్థలు మరియు బీసీ ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ నిధులు దుర్వినియోగంపై రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంపై రాజధాని మూడుముక్కలాటాడుతూ రాజకీయాలు చేయడంపై నిలకడలేని పాలనపై ఆనాడు చంద్రబాబు ఎస్టీలకు వస్తున్న సబ్సిడీ రుణాలు రద్దు చేయడం అదేవి ధంగా ఎస్సీ కాలనీ నందు రోడ్లు నీళ్ల మయముతో ఉండడాన్ని పరిశీలించడం అయినది స్ట్రీట్ లైట్ లు ఎక్కడి కక్కడ వెలగక పోవడాన్ని ప్రజలందరూ కూడా ఇదేమి కర్మ కార్యక్రమంలో వాపోవడం జరిగింది వారి యొక్క అభిప్రాయాన్ని తెలుసుకొని ఫార్మేట్లో నింపుతూ 9261292612 నెంబర్ కి మిస్డ్ కాల్ చేయిస్తూ అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువస్తూ అదేవిధంగా గతంలో చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఏ విధంగా అభివృద్ధి సంక్షేమం జరిగిందో వారికి వివరిస్తూ ఆనాడు ఉన్నటువంటి చంద్రన్న బీమా అన్న క్యాంటీన్లు చంద్రన్న పెళ్లి కానుక మరి పేద ప్రజలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాల్ని నియోజకవర్గంలో ఎన్నో పరిశ్రమలు తీసుకువచ్చి ఉపాధి కల్పించిన విషయాల్ని ఏర్పేడు దగ్గరలో ఐఐటి ఐసర్ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు తీసుకొచ్చి అభివృద్ధికి పాటుపడినటు వంటి ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వం అని తెలియపరచడమైనది మరి వివిధ అంశాలపై వారి అభిప్రాయాల్ని సేకరించడమైనది ఇక నైనా ప్రభుత్వంలో మార్పు రావాలని తెలుగుదేశం పార్టీ తరఫున ప్రజల తరఫున డిమాండ్ చేయడం అనేది ఈ కార్యక్రమం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మరియు క్లస్టర్ ఇంచార్జ్ రెడ్డి వారి గురువారెడ్డి నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి భూపతి యాదవ్ మాజీ సర్పంచ్ సూర్యనారాయణ నియోజకవర్గ మహిళా ప్రెసిడెంట్ కృష్ణవేణి మాజీ రైతు ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు పార్లమెంటు బీసీ ఉపాధ్యక్షుడు రాచేడు సుబ్రహ్మణ్యం మండల బీసీ సెల్ అధ్యక్షుడు మునయ్య స్థానిక పార్టీ నాయకులు మస్తాన్ నాయుడు మధు నాయుడు భరత్ కుమార్ మురళి శంకరయ్య సుబ్రహ్మణ్యం మునీంద్ర మహేష్ బత్తయ్య తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

ముక్కంటి సేవలో గుడివాడ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం మాజీ మంత్రి, గుడివాడ శాసనసభ్యులు కొడాలి నాని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు.స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బియ్యపు ఆకర్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్‌అదాలత్

- విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి పిలుపు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఫిబ్రవరి 11 వతేది జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని, కక్షిదారులు లోక్ అదాలత్‌లో పాల్గొని కేసులు పరిష్కారం చేసుకొని లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి పిలుపునిచ్చారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరిం చుకోవడానికి సహకరిస్తూ రాబోయే ఫిబ్రవరి 11 జరుగు జాతీయ లోక్‌అదాలత్ విజయవంతానికి కృషి చేయా లని, "రాజీమార్గమే రాజ మార్గంగా" ఎన్నుకొని ఎక్కువ కేసులని పరిష్కరించనికి దోహద పడాలని కోరారు. ఈలోక్ అదాలత్‌కి కోర్టులో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసుల్లో కక్షిదారు లను ఒప్పించి అధిక సంఖ్యలో పూర్తిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యముగా అన్ని రకాల క్రిమి నల్, సివిల్ కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసులు, ఎన్ఐ యాక్ట్ కేసుల్లో సుమారు రెండు లక్షల విలువగల చెక్కు ఎన్ఐ యాక్ట్ కేసు అండర్ సెక్షన్ 138, బ్యాంక్ రికవరీ కేసు, మాక్ట్ కేసు, మ్యాట్రిమోనీ కేసు ఓ/ఎస్ 125 సిఆర్‌పిఎస్, లేబర్ డిస్ప్యూట్స్, ల్యాండ్ ఆక్విసిషన్ కేసు, ఇతర సివిల్ కేసు, రెవెన్యూ కేసు, కాంపౌండ్ ఎక్సైజ్ కేసు, ప్రీ లిటిగేషన్ కేసులు తదితర కేసులు పరిష్కరించుటకు జాతీయ లోక్ అదాలత్ ఉపయోగించు కోవాలని కోరారు.

20వ వార్డులో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి...

- ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్న విజయ్‌కుమార్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : పట్టణంలోని 20వ వార్డు నందు శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు జి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ ప్రతి ఇంటికి వెళ్లి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిత్యవసర వస్తువులు, కరెంట్ బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు ఎలా ఉన్నాయి, ఈ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువులు, కరెంట్ బిల్లులు, ఇసుక, ఇంటి పనులు, మహిళల భద్రత, రాజధాని పైన ప్రజలను అడిగి తెలుసుకున్నారు., ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలుగా నష్టపోయామని, ఆఖరికి అర్హత ఉన్న పెన్షన్లు కూడా తీసివేశాడని వాపోయారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు ఇన్చార్జులు బాబు రెడ్డి, మీర్జా, సుమ తమ్మమూర్తి,హేమంత్,బాలు,గోపి,రమేష్‌యాదవ్,దశరథఆచారి, కంఠ రమేష్, చక్రాల ఉషా,మాజీ పాలక మండలి సభ్యులు గుర్రప్ప శెట్టి, కాసరం రమేష్, ఖాదర్ బాషా, డి.వి నారా యణ, గోపి, రేణుక దేవి, ఎం.ఎస్ రెడ్డి, రామకృష్ణ, మునిరజా యాదవ్, వజ్రం కిషోర్, బషీర్, సురేష్ నాయుడు, యాదగిరి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, 20వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

తిరుపతి పార్లమెంట్ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ అహమద్ అలీ నియామకం

విశాలాంధ్ర- పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ ప్రాంతంలో వైసిపి పార్టీ తిరుపతి పార్లమెంటరీ వక్ఫ్ ఫోర్డ్ డైరెక్టర్.గా పుత్తూరు పట్టణాని ఎన్టీఆర్ కాలనీ కి చెందిన. అహమద్ అలీ. మంత్రి వర్యులు శాసన సభ్యులు ఆర్.కే.రోజా చేతుల మీదుగా తిరుపతి పార్లమెంట్ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ గా నియామక పత్రాన్ని అందుకున్నరు. ఈ సందర్భంగా అహమద్ అలీ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన మంత్రి ఆర్.కే.రోజా గారికి కృతజ్ఞతలు తెలుపుతూ మైనారిటీ ల వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని తెలిపినారు.కార్యక్రమం లో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్.సిరాజ్ బాషా ,చాను,జమీర్,సర్దార్, హాషీం, ఇలాజ్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నించే వారికి...

ఇప్పుడు తిట్లు - తరువాత కొట్టమంటాడేమో ?

- బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్ రావు ఎద్దేవా

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : అదేదో సామెత చెప్పినట్లు 'రానురాను రాజుగారి గుర్రం గాడిద అయినట్లు' మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నించే వారిని ఇప్పుడు తిట్టమని, తరువాత దశలో కొట్టమని కలెక్టర్లను ప్రోత్సహించినా ఆశ్చర్యం లేదని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు ఎద్దేవా చేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొద టిసారిగా అభాగ్యులకు ఆసరాగా ఉండాలన్న గొప్ప సంకల్పంతో వృద్ధులకు, వికలాంగులకు 'సామాజిక భద్రతా పింఛను' పథకాన్ని ప్రవేశపెట్టింది తెలుగుదేశం పార్టీయేనని ఉమేష్ పేర్కొన్నారు. 2014 వరకు రెండు వందల రూపాయలు ఉన్న సామాజిక పెన్షన్‌లను ఐదు రెట్లు పెంచి వెయ్యి రూపాయలు చేసిన గొప్ప పాలనా దాతృత్వం కలిగిన వ్యక్తి చంద్రబాబు అని, అలాగే వెయ్యి రూపాయలు ఉన్న పెన్షన్ ను రెండు వేల రూపాయలకు పెంచి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అండగా నిలబ డ్డారని ఉమేష్ కొనియాడారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆనాడు రాష్ట్ర ఆర్థిక పరిస్థి తులు ప్రోత్సాహకరంగా లేకపోయినా సంక్షేమ పథకాల అమలులో వెనుకడుగు వేయకుండా 54 లక్షల పెన్షన్ లను ప్రతి నెలా ఒకటో తేదీ కల్లా అందించిన విషయాన్ని జగన్మోహన్ రెడ్డి దాచిపెట్టి, 39 లక్షలుగా అబద్ధపు ప్రచారానికి పూనుకోవడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని ఉమేష్ ఆరోపించారు. ఆరోగ్యపరంగా, వయో రీత్యా అంతంతమాత్రంగా ఉండే వృద్ధులకు, వితం తువులకు, వికలాంగులకు పిడుగు లాంటి వార్తను నోటీసుల రూపంలో ఇచ్చి వారిని భయభ్రాం తులను చేస్తూ, ఉన్న ఆ ఒక్క పింఛను అనే ఆసరాను లేకుండా చేసి, వారి పీకలు నొక్కడానికే జగన్ బటన్ నొక్కుతున్నట్లుందని ఉమేష్ ఎద్దేవా చేశారు. పింఛను అనేది ప్రభుత్వం యొక్క సామాజిక బాధ్యత అని, అదేమీ జగన్మోహన్ రెడ్డి సొంత కార్యక్రమం కాదు అని ఉమేష్ హెచ్చరిం చారు. అవ్వా, తాతలకు అండగా ఉంటానని మాటిచ్చి, నిట్టనిలువునా వారిని మోసగించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ దమన నీతిని ఎండగడుతూ, వాస్తవ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వాన్ని నిలదీస్తున్న పత్రికలను, ప్రజాస్వామ్య వాదులను, ప్రతిపక్షాలను బహిరంగంగా తిట్టమని కలెక్టర్లను ప్రోత్సహిస్తూ నిన్నటి రోజు జగన్ పిలుపు నివ్వడం నియంతృత్వ పాలనకు నిదర్శనం అని ఉమేష్ ఆరోపించారు. కలెక్టర్‌గా నియమితులయ్యే అఖిలభారత సర్వీసు అధికారులు ఇకపై అసభ్య పదజాల అభ్యసనకు, అత్యంత జుగుప్సాకరమైన నడవడిక కోసం కొడాలి నాని వంటి వారి వద్దకు పునశ్చరణ తరగతులకు వెళ్ళేలా జగన్మోహన్ రెడ్డి చట్టం చేసినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదని ఉమేష్ ఎద్దేవా చేశారు.ఎంతో గౌరవప్రదంగా భావించే ఉన్నతమైన 'కలెక్టర్' ఉద్యోగ బాధ్యతల అర్థాన్నే మార్చివేసి, తిట్టడం మరియు కొట్టడం అనే సరికొత్త నూతన బాధ్యతలను అప్పగించడంతో ఇన్నేళ్ళ స్వతంత్ర భారతావని పాలనా చరిత్రలో నిన్నటి రోజు ఒక దుర్దినంగా ఉమేష్ అభివర్ణించారు.ఇప్పటికైనా అఖిలభారత సర్వీసు అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండకపోతే ఇటువంటి పరిస్థితే ఎదురవతుందని గుర్తించి, పాలకుల పాదాక్రాంతం కాకుండా ఉంటే మంచిదని ఉమేష్ హితవు పలికారు.